**కథ**

# ఐ లవ్యూ...బట్ యు డోంట్ లవ్ మీ!

**దుర్గాప్రసాద్ సర్కార్**

**రమేష్, వెంకట్, నారాయణ, నేను రామకృష్ణా బీచ్‌లో బస్సు దిగాం. అప్పుడు సమయం సాయంత్రం అయిదు గంటలయింది.**

**కెరటాల హోరు స్పష్టంగా వినిపిస్తోంది.**

**నీరెండ ఇసుకతిన్నెల మీద పడి బంగారం రాసులు పోసినట్లుంది.**

చల్లని సాయం సమయాన్ని ఆస్వాదించడానికి వచ్చిన వాళ్లతో తీరమంతా సందడిగా ఉంది. జంటలుగా కూర్చున్నవాళ్లు పూదోటలో పూసిన రజనీ పువ్వుల్లా ఉన్నారు.

"ఇక్కడ కూర్చుందాం" కెరటాలకు కాస్త దూరంగా ఉన్న ప్రదేశాన్ని చూపిస్తూ అన్నాడు రమేష్.

అందరం అక్కడ చతికిలపడ్డాం.

"వెంకట్! నువ్వెళ్లి మిరపకాయ బజ్జీలు పట్రా" అన్నాడు రమేష్.

"సరే" అంటూ వెళ్లాడు వెంకట్.

"ఏరా చందూగాడి స్వప్నసుందరి వస్తుందంటావా?" నారాయణ వైపు చూసి ప్రశ్నించాడు రమేష్.

"నాకేం తెలుసు? వాడినే అడుగు" నా వైపు చూస్తూ అన్నాడు నారాయణ.

"ఏరా చందూ! వస్తుందా?"

"వస్తుందిరా కంగారెందుకు?" అన్నాను నేను తాపీగా.

"బజ్జీలు లేవురా. కారం మిక్సరుంది" అంటూ తలా ఓ పొట్లం అందించాడు వెంకట్.

అందరం తినసాగాం.

"నీ ప్రియురాలిని చూపిస్తావని నా లవర్‌తో సిన్మా ప్రోగ్రాం ఉంటే దాన్ని క్యాన్సిల్ చేసుకున్నాను" అన్నాడు రమేష్.

"మేమూ అంతే బాబూ" వెంకట్, నారాయణ కోరస్‌గా అన్నారు.

"చూపిస్తానన్నాను గదా. ముందు తనని రానివ్వండి" అన్నాను నేను.

"ఎలా ఉంటుందిరా?" ప్రశ్నించాడు వెంకట్.

"తినబోతూ రుచి అడగకూడదన్నట్లు- చూడబోతూ ఆ వివరాలెందుకులే" అన్నాడు రమేష్.

సరిగ్గా అదే సమయంలో 'ఆమె' తన ఇద్దరు ఫ్రెండ్స్‌తో మాకు కాస్త దూరంలో ప్రత్యక్షమయింది.

"అదిగో" అన్నాన్నేను ఉద్వేగంగా.

నేను చూపించిన దిక్కు చూశారంతా.

"బ్లూ చుడీదార్ అమ్మాయా?" ఆత్రంగా ప్రశ్నించాడు రమేష్.

"కాదు" అన్నాను నేను.

"రెడ్ చుడీదార్!" అన్నాడు వెంకట్.

"ఊహూ.."

"మరి?" ముగ్గురూ వింతగా చూశారు నా వైపు.

"శారీలో ఉన్న అమ్మాయి" అటే చూస్తూ చెప్పాను.

వాళ్లు ముగ్గురూ ఆమె వైపు పరీక్షగా చూసి నా వైపు తిరిగారు.

"గొప్ప టేస్ట్" తేలిగ్గా అన్నాడు రమేష్.

"ఏం?"

"ఎందుకులే చెబితే బాధపడతావ్"

"అదేం నాకు కొత్త కాదులే. ఫర్వాలేదు చెప్పు" ఆమె గురించి ఏం చెబుతాడా అన్న ఆసక్తితో అన్నాను.

"ఈరోజుల్లో పుట్టాల్సిన అమ్మాయి కాదు"

"ఎందుకని?" ప్రశ్నించాడు వెంకట్. అతని స్వరంలో కాస్త వెటకారం ధ్వనించింది.

అయినా నేను బాధపడలేదు.

"అందరూ చుడీదార్లు, మిడ్డీలు వేసుకుంటుంటే అమ్మమ్మలా ఆ శారీ ఏమిటి?" అన్నాడు రమేష్.

"అంతేకాదు ఆ జడ చూడు... పాత సినిమాల్లో సావిత్రి ననుకుంటుందేమో" పగలబడి నవ్వుతూ అన్నాడు వెంకట్.

"చేతులకి ఎన్ని గాజులేసుకుందో...కొంపదీసి ఏదైనా పల్లెటూరు నుంచి వచ్చిందా?"

"ఎంత పెద్ద తిలకంబొట్టు పెట్టుకుందో"

"ఆ జోళ్లు చూడు... హీల్స్ లేకుండా ఆకుల్లా ఎలా ఉన్నాయో"

"ఎనీవే...టోటల్లీ షి ఈజ్ అవుటాఫ్ టుడేస్ ఫ్యాషన్"

రమేష్, వెంకట్ పగలబడి నవ్వారు.

నారాయణ మాత్రం మౌనంగా ఉండిపోయాడు.

"ఏమి్రా...వీడి టేస్ట్‌కి మతిపోయిందా? మాట్లాడకుండా ఉండిపోయావ్?" అన్నాడు రమేష్.

"ఇందులో అంతగా నవ్వాల్సిందేముందో నాకర్థం కావడం లేదు"

"అంటే వీడి లవర్ బాగుందంటావా?"

"డౌటా?"

"ఓర్నాయనో...చందూగాడే అనుకున్నాను...నీవి కూడా తాత బుద్ధులే"

"అవున్రా..అయితే ఇప్పుడేమంటారు? నిజానికి ఆమె పక్కనున్న ఇద్దరి కంటే చందూగాడి లవరే బాగుంది. అమ్మాయిల్ని చుడీదార్లలోను, కత్తిరించేసిన పొట్టి జుత్తులోను, ఆర్టిఫిషీయల్ రంగుల మెరుగులతోను చూడటం అలవాటయిన మీకు సహజంగా ఉన్న ఆమె అందచందాలు గుర్తించడం కష్టమే" నారాయణ వాగ్ధాటికి రమేష్, వెంకట్‌ల నోళ్లు మూతలు పడిపోయాయి.

"ఆమెని మిగతా ఇద్దరమ్మాయిల ముస్తాబులోనూ, వాళ్లిద్దర్నీ ఆమె ముస్తాబులోనూ ఒక్కసారి ఊహించుకోండి...కాస్త రంగు తక్కువైనా చందూగాడి లవరే అందంగా ఉంటుంది" ఆవేశంగా అన్నాడు నారాయణ.

ఆ మాటకి మరోసారి వాళ్ల వైపు పరిశీలనగా చూశారిద్దరూ.

నేను నారాయణ వైపు ప్రశంసగా చూశాను.

"నువ్వు చెప్పింది నిజమేరా నారాయణా" ఆమెని బాగా పరిశీలించాక అన్నాడు వెంకట్.

"నువ్వేమంటావ్?" అన్నట్లు రమేష్ వైపు చూశాడు నారాయణ.

"వెంకట్‌గాడు చెప్పింది నిజమే" అన్నాడతను.

నారాయణ చిన్నగా నవ్వి నా వైపు చూశాడు.

"నీ అభిరుచి, ఆలోచనలకు లోతెక్కువని నాకు తెలుసురా. ఇంతకీ ఆ అమ్మాయిని తొలిసారి ఎక్కడ చూశావ్?" అంటూ ప్రశ్నించాడు.

"నెల రోజుల క్రితం వాళ్ల నాన్నతో నా షాపుకొచ్చింది. ఓ పోర్ట్రైట్ గీయించుకున్నార్లే నాతో" చెప్పాన్నేను.

"ఆమెతో మాట్లాడేవా?"

"లేదు"

"అంటే వన్‌వే లవ్ అన్నమాట" అన్నాడు రమేష్.


"అవును"

"నాకు నచ్చనిది అదే. అమ్మాయిలైనా, అబ్బాయిలైనా ప్రేమలో పడ్డాక ఆ విషయం వెంటనే చెప్పేయాలి. పైపై మాటలు మాట్లాడుతూ, చూసుకుంటూ ఏళ్లూ ఊళ్లూ గడిపేయడం... అటు అమ్మాయో- ఇటు అబ్బాయో దూరమైపోతున్న టైంలో ప్రేమ సంగతి వెల్లడించడం నా దృష్టిలో పెద్ద నేరం. దీనివల్ల ఇద్దరికీ లాభం ఉండదు నష్టం తప్ప. లాస్ట్ మూమెంట్‌లో ఈ విషయం చెప్పడం వల్ల అప్పటికే అవతలి వాళ్లు వేరే నిర్ణయం తీసుకుంటే ఎవ్వరికీ మనశ్శాంతి ఉండదు. అందుకే పెద్దలన్నారు. 'ఆలస్యం అమృతం విషం' అని."

"నాయనా రమేష్...నీ వాగ్ధాటి ఆపు. మన వాడికి జ్ఞానోదయం అయిందిలే" అన్నాడు నారాయణ.

"అయితే ఆమెతో ఎప్పుడు మాట్లాడతావ్?" ప్రశ్నించాడు వెంకట్.

"త్వరలోనే" చెప్పాన్నేను.
"త్వరలోనే కాదు చిట్టితండ్రీ నేడే...నేడే జరగాలది. అంతేకాద్ధు ఈ క్షణానే నువ్వు తనతో మాట్లాడాలి."
"ఇప్పుడా?" కంగారుగా అన్నాను నేను.
"ఏం భయమా?" వేళాకోళంగా ప్రశ్నించాడు వెంకట్.
"అదేం కాదు"
"మరి?"
"సడన్‌గా వెళ్లి ఏం మాట్లాడాలి? సమయం, సందర్భం ఉండాలి కదా"
"అన్నీ సమకూరితే నువ్వేనేమిటి గాడిద కూడా ప్రేమిస్తుంది" చిరాగ్గా అన్నాడు వెంకట్.
"వాళ్లు నీతో ఏదో పోర్‌ట్రైట్ గీయించుకున్నారన్నావు కదా. ఆ విషయం కదిపినట్లు మాటలు కలుపు" అన్నాడు రమేష్.
"గుడ్ ఐడియా" అన్నాడు వెంకట్.
నారాయణ వైపు చూశాను నేను.
"వెళ్లు" అన్నట్లు తలూపాడతను.
తప్పనిసరయి వాళ్ల వైపు నడిచాను.
తనే నన్ను ముందుగా గమనించింది.
నేను చిన్నగా నవ్వాను.
ముందు గుర్తుపట్టలేదు కాబోలు నవ్వలేదు.
కొంత సేపు అయ్యాక పెదాలు విడీవిడనట్లు నవ్వింది.
ముత్యాల్లాంటి ఆమె పలువరున తళుక్కున మెరిసింది.
"బాగున్నారా?" చొరవ తీసుకుని ప్రశ్నించాను.
"ఊ..."
"మీరుండేది ఎక్కడ?" ఆమె ఇల్లు ఇక్కడికి దగ్గరే అని తెలిసి, రోజూ ఆమె తన ఫ్రెండ్స్‌తో సముద్ర తీరానికి వస్తుందని తెలిసినా తెలియనట్లు ప్రశ్నించాను.
నా ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చి తన ఫ్రెండ్స్‌కి నా గురించి చెప్పింది.
"అలాగా! అయితే నా బొమ్మ ఇప్పటికిప్పుడు చూస్తూ గీసెయ్యగలరా?" రెడ్ చుడీదార్ అమ్మాయి ప్రశ్నించింది.
"గీయగలను" అంటూ జేబులోంచి పెన్ను, కాగితం తీసి ఆమెనోమారు పరీక్షగా చూశాను.
వెంటనే నా చేతిలోని కలం కదనుతొక్కింది. క్షణాల్లో ఆమె రూపు కాగితం మీద ప్రత్యక్షమయింది.
"వండ్రఫుల్" తన బొమ్మని చూసుకుంటూ అందామె.
"నాది కూడా గీయండి" బ్లూ చుడీదార్ అమ్మాయి అడిగింది.
ఆమె బొమ్మ కూడా గీసిచ్చాను.
"నువ్వు కూడా గీయించుకోవే" ఆమెతో అంది రెడ్ చుడీదార్.
ఆమె మొహమాటంగా నవ్వింది.
"ఏమండీ మా కైవల్య బొమ్మ కూడా గీయండి" అంది.
కైవల్య...మంచి పేరు' అనుకున్నాను.
"మిమ్మల్నే.." బ్లూ చుడీదార్ తొందర చేసింది.
"కైవల్యగారూ గీయమంటారా?" ప్రశ్నించాను.
"ఊ.." చిరు సిగ్గుతోనే సమ్మతి తెలిపింది.
నేను ఆమె వైపు తదేకంగా చూశాను.
ఒత్తయిన నల్లని కురులు,



విల్లులా వంగిన కనుబొమలు, చెంపకు చారడేసి కనులు, దివి నుంచి భువికి వేసిన నిచ్చెనలాంటి పొడ వాటి నాసిక, గులాబీ రేకుల్ని తుంచి అతికించారేమో అని పింపజేస్తోన్న ఎర్రని జ్యూసీ పెదాలతో అలనాటి సుందర శిల్పమేదో ప్రాణం పోసుకుని ఎదుట ప్రత్యక్షమయిన ట్లుందామె.

"అంతసేపు చూస్తున్నారేమిటి...గియ్యండి సార్" అంది రెడ్ చుడీదార్.

## అవే బాగుంటాయి

**'ఔను వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు' చిత్రంతో అందరి ఇష్టాన్ని పొందిన కళ్యాణి అవకాశాల్ని బాగానే చేజిక్కుంచుకుంది. ఇప్పుడు జగపతిబాబుతో కలిసి మరో సినిమాలో నటిస్తోంది. చూడగానే తెలుగుదనం ఉట్టిపడేట్టున్న కళ్యాణి ప్రేక్షకుల నాడిని బాగానే పట్టేసిందంటున్నారు. జగపతిబాబుతో ఇంతకుముందామె పెదబాబులో నటించింది. ఇప్పుడు 'పందెం'లో నటించింది.**



నేను ఉలిక్కిపడి సర్దుకున్నాను.

నా దగ్గరున్న కాగితాన్ని రెండు ముక్కలు చించి పై దాని మీద ఆమె బొమ్మని బాల్‌పెన్నుతో గీసి ఆమెకి ఇచ్చాను.

తన బొమ్మ బాగా గీశానన్న భావం ఆమె కళ్లల్లో కనిపించిన వెలుగే నాకు చెప్పింది.

"థాంక్యూ" అంది ఇందాకటిలానే నవ్వుతూ.

"ఎంత బాగా గీశారండి బాబూ...అన్నట్లు మీ పేరు?" ప్రశ్నించింది రెడ్ చుడీదార్.

"చందూ" అని ఆమె పేరు అడిగాను.

"నా పేరు రోషిణి. దీని పేరు మాళవిక" బ్లూ చుడీదార్‌ని చూపిస్తూ చెప్పింది.

"ఓకే...నేను వెళతానండి" అన్నాను నేను.

"సరే"

నేను వెనుదిరుగుతూ కైవల్య వైపు చూశాను.

ఆమె నన్నే చూస్తోంది.

పూలరథంలో ఊరేగినట్లు అనిపిస్తుండగా తిరిగి మా వాళ్లని చేరుకున్నాను.

"ఏమిట్రోయ్...వెళ్లి మాట్లాడమంటే పిచ్చి గీతలు గీస్తుండిపోయినట్లున్నావ్" అన్నాడు రమేష్.

నేనేం మాట్లాడలేదు.

జేబులోంచి కాగితం తీశాను.

కైవల్య బొమ్మ గీసేటప్పుడు ఆ కాగితం కిందుంచిన కాగితం ఇదే. ఆమె బొమ్మ బాల్‌పెన్నుతో గీయటం వల్ల ఆ వత్తిడికి కింద పెట్టిన ఈ కాగితం మీద కూడా కైవల్య బొమ్మ తాలూకు రేఖలు స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్నాయి. నా మనసులో ముద్రించుకుపోయిన కైవల్య రూపాన్ని గుర్తు చేసుకుంటూ, ఈ రేఖల సాయంతో ఆమె బొమ్మ గీశాను.

అచ్చుగుద్దినట్లు కాగితం మీద రూపు దిద్దుకుంది ఆమె బొమ్మ.

"ఎస్" ఉద్వేగంతో నా నోటంట అప్రయత్నంగా వెలువడిందా పదం.

"అబ్బ...అచ్చు ఆమెలాగే గీశావ్" ప్రశంసగా అన్నారు ముగ్గురూ.

"ఆమె పేరు కనుక్కున్నావా?" ప్రశ్నించాడు రమేష్.

"ఊ" అని బొమ్మ కింద కైవల్య అని రాశాను.

"ఆమెలాగే ఆమె పేరు కూడా డిఫరెంట్‌గానే ఉంది" అన్నాడు వెంకట్.

"అది సరే...ఇంతకీ ఆమెని ప్రేమిస్తున్న సంగతి ఎప్పుడు చెబుతావ్?" సీరియస్‌గా ప్రశ్నించాడు రమేష్.

నాకేం చెప్పాలో తోచలేదు.

నారాయణగాడి వైపు చూశాను.

"ఇప్పుడామెతో ఏం మాట్లాడావ్?" ప్రశ్నించాడతను.

నేను వాళ్ల బొమ్మలు గీసిన సంగతి, అక్కడ జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పాను.

"అయితే...మరో రెండు మీటింగుల తర్వాత చెప్పెయ్యొచ్చు"

"ఊ..."

"అంటే ఎలా లేదన్నా వారం రోజుల్లో ఇదంతా అయిపోవచ్చన్నమాట" అన్నాడు రమేష్.

"చాలా ఎక్కువ టైం" అన్నాడు వెంకట్.

"కాదు... ఆమాత్రం టైం ఉండాల్లే. ఇలా చూసి అలా 'ఐ లవ్యూ' అంటే ఒప్పుకునే మనిషిలా లేదామె. మరీ బలవంతపెడితే మొదటికే మోసం రావచ్చు" అన్నాడు నారాయణ.

"ఓకే! అయితే వారం రోజుల్లో ఆమెతో ఐ లవ్‌యూ అనడం, ఇదే ప్లేస్‌లో తనతో కలిసి కనిపించడాన్ని మేం వీక్షిస్తామన్నమాట" అన్నాడు రమేష్.

నేను చిన్నగా తలూపాను.

అప్పటికే చీకటి పడడంతో అంతా వెనుదిరిగాం.

* * *

"హాయ్ చందూ" రమేష్ గొంతు వినిపించి బ్రష్ పక్కన పెట్టి వెనుదిరిగాను.

నారాయణ, వెంకట్ కూడా వచ్చారు.

"కైవల్యకి ఐ లవ్యూ చెప్పావా?"

"లే...లేదు"

"ఎందుకని?"

"బొమ్మలు గీసుకుంటూ షాపులో ఉండిపోయుంటాడు" వ్యంగ్యంగా అన్నాడు వెంకట్.

"ఇప్పుడు టైం నాలుగవుతోంది. ఆమె సాయంత్రం పూట బయటికొస్తే ఏయే ప్రదేశాలకి వెళుతుందో నీకు తెలిసే ఉంటుంది. ఆ ప్రదేశాలన్నిటికీ తిరిగి ఎలాగైనా ఈరోజే నువ్వు ఆమెని ప్రేమిస్తున్న సంగతి చెబుతున్నావ్" కమాండింగ్‌గా అన్నాడు రమేష్.

"వారం రోజుల్లో చెబుతానన్నావ్ కదా" అన్నాడు నారాయణ.

"మరెందుకు చెప్పలేదు? ఆమె కనిపించలేదా?"

"కనిపించింది"

"మాట్లాడటానికి అవ్వలేదు కాబోలు"

"అదేం లేదు. ఈ వారం రోజుల్లో మూడుసార్లు బీచ్‌లోనే కనిపించింది. మూడుసార్లూ మాట్లాడాను"

"ఏమిటి నానా చెత్తంతానా?"

నేను బదులివ్వలేదు.

"నువ్వు ముందు షాపు క్లోజ్ చెయ్" అన్నాడు వెంకట్.

"ఎందుకు" ఆశ్చర్యంగా ప్రశ్నించాను నేను.

"నువ్వు ఇమ్మీడియట్‌గా కైవల్య దగ్గరకు వెళుతున్నావ్. ఆమెతో ఐ లవ్యూ అని చెబుతున్నావ్" అన్నాడు రమేష్.

"అవును" వంత పలికాడు వెంకట్.

నేను నారాయణవైపు చూశాను.

అతను మౌనంగా ఉన్నా రమేష్, వెంకట్‌ల అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తున్నాయతని కళ్లు.

"ఓకే" అని షాపుకి తాళమేశాను.

"సరిగ్గా రాత్రి తొమ్మిదింటికి వెంకట్‌గాడి రూంలో అంతా కలుస్తున్నాం. నువ్వు గుడ్‌న్యూస్ చెప్పగానే పార్టీ చేసుకుంటాం. పార్టీకయ్యే ఖర్చంతా నాది" అన్నాడు రమేష్.

"సరే" అంటూ బయలుదేరాను.

ఇరవై నిమిషాల్లో బీచ్‌కి చేరుకున్నాను.

సాగరుడి హోరు లయబద్ధమైన సంగీతంలా వినిపిస్తోంది.

వాకింగ్ చేసేవాళ్లు, స్వీట్ నథింగ్స్ చెప్పుకునేవాళ్లు, బీచ్‌లో ఆడుకునే వాళ్లతో గొప్ప సందడిగా ఉంది.

చల్లటి గాలి ఒంటిని ఆప్యాయంగా హత్తుకుంటోంది.

కాలం కళ్ల ముందే కరిగిపోసాగింది.

చూస్తుండగానే ఆరయిపోయింది సమయం.

కైవల్య వస్తోన్న జాడమాత్రం లేదు.

మరో అరగంట చూసి ఇసుకలోంచి లేచి నిలబడ్డాను.

నా కాళ్లు అప్రయత్నంగా కైవల్య ఇంటివైపు సాగిపోయాయి.

పది నిముషాలు నడవగానే వాళ్లుండే వీధికి చేరుకున్నాను.

వీధి చివర ఎడమవైపు కైవల్య వాళ్ల ఇల్లు అందమైన పొదరిల్లులా ఉంది. అడుగడుక్కీ వాళ్ల ఇల్లు దగ్గరవ్వడమే కాకుండా ఈరోజు ఎలాగైనా ఆమెతో ఐ లవ్యూ అని చెప్పేయాలన్న కోరిక లావాలా పొంగి ప్రవహించసాగింది.

'అవును! ఆరు నూరైనా ఐ లవ్యూ కైవల్య అనేస్తాను. చివరికి ఆమె కనిపించకపోతే వాళ్లింట్లోకి వెళ్లయినా సరే నా మనసులో మాట చెప్పేస్తాను!'

"ఒరే చందూ!" ఎవరో అతి సమీపం నుంచి పిలవడంతో నా ఆలోచనలకు గండి పడి తల తిప్పి చూశాను.

తెల్లగా, సన్నగా, ఉంగరాల జుత్తుతో- రేవంత్ కదూ...

అవును వాడే... డిగ్రీలో నా క్లాస్‌మేట్.

"రేవంత్! బాగున్నావా?" చిరునవ్వుతో పలకరించాను.

"బాగానే ఉన్నాను. నువ్వెలా ఉన్నావ్?"

"నేనూ బాగానే ఉన్నాను. అన్నట్టు నువ్వేమిటి ఇక్కడ!" సందిగ్ధంగా ప్రశ్నించాను.

వాడు డిగ్రీ చేస్తుండగానే బ్యాంకులో ఉద్యోగం వచ్చి హైదరాబాద్ వెళ్లి అక్కడే స్థిరపడిపోయాడు. రెండు మూడేళ్ల క్రితం కనిపించినప్పుడు చెప్పాడా సంగతి. చదువులో చురుగ్గా ఉండే నాకు సరయిన ఉద్యోగం దొరక్క పెయింటర్‌గా జీవిస్తున్నానని తెలిసి బాధ పడటం కూడా గుర్తుంది.

"మా బాబాయ్ వాళ్లు ఉండేదిక్కడే. వాళ్లమ్మాయికి ఈరోజు పెళ్లిచూపులు. ఆయన కొంచెం అమాయకపు చక్రవర్తి. వెనకాముందూ ఎవరూ లేరు. దాంతో నాన్నగారు నన్నూ, అమ్మనీ తోడు పంపించారు" నడుస్తూనే చెప్పసాగాడు రేవంత్.

నేను అన్యమనస్కంగానే వినసాగాను.

"ఏదేమైనా మా చెల్లెలు చాలా అదృష్టవంతురాలు. ఎందుకంటే కోట్లకు అధిపతి ఆమెని స్వయాన కోరి వచ్చాడు. ఏదో ఫంక్షన్లో మా చెల్లిని చూసి పెళ్లంటూ చేసుకుంటే ఆమెనే చేసుకుంటానని పట్టుపట్టుకు కూర్చున్నాడట. వాళ్ల పెద్దవాళ్లు మల్టీమిలియనీర్ల అమ్మాయిల్ని చేస్తామన్నా ససేమిరా అన్నాడట. పార్థసారధి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ పేరు నువ్వు వినే ఉంటావ్"

నేను తన మాటలు పట్టించుకోవటం లేదని గమనించినట్లున్నాడు. నా వైపే చూస్తూ ప్రశ్నించాడు.

"పార్థసారధి గ్రూప్ ఆఫ్ కంపెనీస్. విన్నాను! రాష్ట్రంలో హోటల్స్ నుంచి హాస్పిటల్స్ వరకు అన్నిటిలోనూ ఆ కంపెనీ మాంచి ఫేమస్" అన్నాను.

"ఆ పార్థసారధిగారి ఏకైక కుమారుడు వినయ్‌సారధి గారే మా చెల్లెల్ని చేసుకోబోతున్నాడు."

"కంగ్రాచ్యులేషన్స్" రేవంత్‌కి షేక్‌హ్యాండిస్తూ అన్నాను.

వాడు చెప్పిందే నిజమైతే ఇది గొప్ప సంచలన వార్తే. నిజంగా వీడి చెల్లెలు చాలా అదృష్టవంతురాలు. అదే అన్నాను వాడితో.

"అవును" సంతోషంగా అన్నాడు వాడు.

ఇద్దరం కైవల్య ఇంటిముందుకొచ్చాం. వాడు నడవడం ఆపేసి- "రారా చందూ" అన్నాడు.

"ఎక్కడికి?" ప్రశ్నించాను నేను.

"ఇదే మా బాబాయ్ వాళ్ల ఇల్లు."

నా నెత్తిన పిడుగు పడినట్లయింది!

"కమాన్ యార్" వాడు చనువుగా నా భుజం పట్టుకుని లోపలికి తీసుకుపోయాడు.

నా వళ్లంతా చెమటలు పట్టేశాయి.

కాళ్లు తడబడుతున్నాయి.

అయినా నిభాయించుకున్నాను.

"మీ...మీ...చెల్లెలి పేరు కైవల్య?" ఎక్కడో మిగిలి ఉన్న లేశమాత్రపు ఆశ కాదన్న సమాధానాన్ని కోరుతోంది.

కానీ అలా జరగలేదు.

"అవును! నీకెలా తెలుసు?" నా ఆశని తునాతునకలు చేస్తూ రేవంత్ నోటి నుంచి వెలువడ్డాయా మాటలు.

అతనికి సమాధానం చెప్పలేక ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుండిపోయాను.

"జస్ట్ మినిట్. కాఫీ తీసుకొస్తాను" అంటూ లోపలికి వెళ్లిపోయాడు రేవంత్.

నా దృష్టి చిరునవ్వులు చిందిస్తోన్న కైవల్య ఫోటోమీద పడింది.

అందమైన కైవల్య అమాయకంగా నవ్వుతోంది.

ఆ నవ్వులో అప్పుడే విరిసిన గులాబీల తాజాదనం, మల్లెల పరిమళం కలగలసిపోయినట్లు అనుభూతి చెందాను.

ఆ తాజాదనం, పరిమళం వసివాడిపోకూడదు. ఆ నవ్వు నిండు నూరేళ్ల నిత్యవసంతమై వెల్లివిరియాలి. అలా జరగాలంటే తను ఆమెకి దూరంగా వెళ్లిపోవాలి. తన స్వార్థం కోసం చూసుకుని ఐ లవ్యూ అంటే ఏమో...ఆమె తనని చేసుకోవడానికి సిద్ధపడొచ్చు. అదే జరిగితే ఆమె జీవితం బతకడానికి చేసే పోరాటంతోనే ఛిద్రమయిపోతుంది. గాలి-వెలుతురు లేని ఇరుకుగదిలో గబ్బిలంలా మారిపోక తప్పదామె.

వీల్లేదు... అలా జరక్కూడదు. వినయ్‌సారధి లాంటి కుబేరుడు ఆమెని కోరి వచ్చినప్పుడు ఆమెకి పట్టిన అదృష్టానికి అడ్డుగా తను వెళ్లకూడదు. ఆమె అష్టైశ్వర్యాలు అనుభవిస్తూ మహారాణిలా జీవించాలి. తనదేముంది చినుకుపడితే మొలిచిన గడ్డిపరకలాంటి వాడు. అలాంటి తన వల్ల ఆమెకి పట్టబోతున్న యోగం దూరమైపోకూడదు.

రేవంత్ రాకముందే వెళ్లిపోవాలి అనుకుంటూ లేచి శక్తి కూడగట్టుకుని బయటికి నడిచాను. వెంకట్‌గాడి రూమ్‌కి ఎలా చేరుకున్నానో నాకే తెలియదు.

"ఐ లవ్యూ చెప్పావా?" నన్ను చూడగానే అప్పటికే అక్కడున్న రమేష్, వెంకట్, నారాయణ ప్రశ్నించారు.

"లేదు"

"ఏం?"

"నేనామెని ప్రేమిస్తున్నాను గనుక"

"ఒరే తాగొచ్చావా?" కోపంగా ప్రశ్నించాడు రమేష్.

"లేదు...ఆ పనిమీదే వెళ్లాలి పదండి. అక్కడంతా చెబుతాను. బిల్ కూడా నేనే చెల్లిస్తాను" అన్నాను.

వెంకట్‌గాడు రూమ్‌కి తాళమేశాక అందరం బార్ వైపు నడిచాం.

